పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లే టార్గెట్


పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసిన దృశ్యం(ఫైల్)


ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి రాగి సామగ్రి ఎత్తికెళ్లిన దృశ్యం(ఫైల్)

కొండాపురం : మండలంలోని తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బురుజుపల్లె, ఏటూరు, బ్రాహ్మణపల్లె, సంకేపల్లె, తాళ్లప్రొద్దుటూరు గ్రామాల్లో 11 ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురయ్యాయి. కొండాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో పెంజి అనంతపురం, ముచ్చుమర్రి, కొండాపురం, తిమ్మాపురం, చిన్నపల్లె, పొట్టిపాడు గ్రామాల్లో 9 ట్రాన్స్‌ఫార్మర్‌లు పోయినట్లు ఆయా స్టేషన్‌ల్లో కేసులు నమోదు చేశారు. కొందరు సులువుగా సంపాదించాలని అత్యాశతో ముంపు గ్రామాల్లో ఎవరు పర్యటించరని నిఘా వేసి ప్రభుత్వంకు చెందిన విద్యుత్ సామగ్రి దొంగలిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొందరు డబ్బుల కోసం ప్రమాదం అని తెలిసినా విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులగొడుతున్నారు. పొల్లాల్లో ఏర్పాటు చేసిన 16 కేవీ, 25 కేవీ సామర్థ్యంగల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేస్తున్నారు. అందులోని రాగి, అల్యూమినియం తీగలు ఇతర సామగ్రిని దొంగలిస్తున్నారు. 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో 80 లీటర్ల ఆయిల్ 35 కిలోలవరకు రాగి తీగలు ఉంటాయి. మార్కెట్లో ఆయిల్ లీటర్ సగటున 100, కిలో ఆల్యూమినియం రూ.350, రాగి కిలో రూ.1100 వరకు ఉంటుంది. అపహరించిన సామగ్రి ఆయిల్‌ను దుకాణాల్లో విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

ఎఫ్ఐఆర్‌లో నమోదులో జాప్యం :

చోరీలకు సంబంధించి విద్యుత్ అధికారులు, రైతులు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్నారు. కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీలు విద్యుత్ శాఖకు సదరు స్టేషన్ అధికారులు ఇవ్వాల్సి ఉంటుంది. ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో తీవ్రజాప్యం చేస్తుండటంతో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయడానికి అడ్డంకులు కలుగుతున్నాయి. ఎఫ్ఐఆర్ కాపీ ఉంటే విద్యుత్ అధికారులు అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపి అనుమతి తీసుకుని కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. ఈప్రక్రియ ఆలస్యం కారణంగా కొత్తవి ఏర్పాటు చేయలేకపోతున్నారు. దీంతో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని దీంతో లక్షల్లో నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పదులసంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్‌లు దొంగలించబడ్డాయి. అయితే పలుకుబడి ఉన్న వారివి మాత్రమే కేసులు నమోదు చేశారు. ఐదు నెలల్లో 20 ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురైనట్లు కేసులు నమోదు చేసి ఎఫ్ఐఆర్‌లు ఇచ్చారు. తోటల్లో దొంగలించబడిన రైతులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ల కోసం విద్యుత్ అధికారులు, పోలీస్‌స్టేషన్‌లకు తిరుగుతూ వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో నిఘా ఉంచి తోటల్లో విద్యుత్ సామగ్రి పోకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇప్పటివరకు ట్రాన్స్‌ఫార్మర్ రాలేదు



నాలుగు నెలల కిందట నా తోటలో గుర్తుతెలియని దుండగులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి అందులోని రాగి, ఆయిల్‌ను ఎత్తికెళ్లారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైనట్లు చెప్పుతున్నారే గానీ ఇప్పటి వరకు విద్యుత్ ట్రాన్స్‌ఫారం ఇవ్వలేదు. త్వరగా ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాలని కోరుతున్నా.

– అంకిరెడ్డిగారి రామచంద్రారెడ్డి, రైతు, బురుజుపల్లె.

త్వరలో ఎర్పాటు చేస్తాం



రోడ్లు అనుకూలంగా ఉన్న తోటల్లో దొంగలు రాత్రివేళ టార్గెట్ చేస్తున్నారు. మండలంలోని తోటల్లో 20 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీ అయ్యాయని వాటికి విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు మంజూరయ్యాని అవి ఇంకా రాలేదని వచ్చిన వెంటనే రైతుల తోటల్లో ఎర్పాటు చేస్తాం.

– ఓబులేసు, మండల విద్యుత్‌శాఖ ఎఈ, కొండాపురం.

ఘనంగా దేవాలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

లింగాల : అంబకపల్లెలో వెలసిన శ్రీ గంగమ్మ దేవత ఆలయ రెండవ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం వేదపండితులు కృష్ణప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ గావించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, భజనలతో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సామాజిక పెన్షన్ 31నే పంపిణీ

వేంపల్లె : సామాజిక పెన్షన్‌లను ఈనెల 31 తేదీనే లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు వేంపల్లె మండలం అభివృద్ధి అధికారిణి దివిజ సంపతి తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ శెలవు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

పర్యావరణానికి అనుకూలంగా జీవనశైలి

పులివెందుల టౌన్ : పర్యావరణానికి అనుకూలంగా జీవనశైలిని మార్చుకోవాలని కళాశాల అసోసియేట్ డీన్ ఎం.మాధవ తెలిపారు. శుక్రవారం ఫుడ్‌సైన్స్ కళాశాలలో ఐడియాస్ ఫర్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ అనుకూల జీవనశైలిని ప్రోత్సహించడానికి పోరాటం అనే అంశంపై వివరిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జాతీయ సేవాపతకం అధికారులు, అధ్యాపకులు ఇంజనీర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రై డే.. డ్రై డే పాటించాలి

కమలాపురం : ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నంద కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణ పరిధిలోని కుప్పూరు వారిపల్లెలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాలతో బాధ పడుతున్న వారి నుంచి రక్తపూతలు తీసుకున్నారు. అలాగే రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు ఎంవీవీ ప్రసాద్, లక్ష్మయ్య, హెల్త్ సూపర్ వైజర్ కొండారెడ్డి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వేముల : ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య తెలిపారు. శుక్రవారం వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సిద్ధంరెడ్డిపల్లెలో ఫ్రైడే–డ్రైడే సందర్భంగా ఇంటింటా ఫివర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి, నిల్వలున్న నీటిలో అబేట్ పిచికారి చేసి, ప్రజలకు మలేరియా, డెంగీ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రతిభ

వేంపల్లి : ఎర్రగుంట్ల మండలం కలమల్ల గ్రామంలో గురువారం జిల్లాస్థాయిలో జరిగిన పోటీలలో వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని కల్పన ప్రతిభ కనబరచి ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు చేత బహుమతి అందుకున్నారని కళాశాల తెలుగు శాఖ విభాగాధిపతి డాక్టర్ నాగలక్ష్మీదేవి తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

జమ్మలమడుగు : ఆర్టీసీ కార్మికుల సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ఏపీపీటీడీ ఉద్యోగులకు జీవో 114 ప్రకారంగా ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని యూనియన్ నాయకులు గేట్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బ్రహ్మం, కార్యదర్శి శివుడులు మాట్లాడుతూ ఉద్యోగస్తులకు రావలసిన నైట్ అవుట్, డే అవుట్‌లు శాలరీ బిల్లులో కలపడంలేదని అలాగే ట్రెజరీనుంచి రిటైర్డ్ ఉద్యోగుల సరండర్ సెలవుల డబ్బులు ఇంత వరకు అందకపోవడం దారుణం అన్నారు. ఆర్టీసీ కార్మికులకు రావలసిన యూనిఫాం, అలవెన్సు, టీఏ, డీఏలను 15 రోజుల్లో చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రీజనల్ సెక్రటరీ సుధాకర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న భాగవత సప్తాహం

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగాలపల్లె వద్ద ఉన్న లక్ష్మివెంకటేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో కొనసాగుతున్న భాగవత సప్తాహ కార్యక్రమం శనివారం ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు భాగవతాన్ని పఠించడం జరుగుతోందన్నారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో మహిళలు తరలివస్తున్నారన్నారు. పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. శనివారం చివరి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగాలి

చక్రాయపేట : ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెరిగేందుకు అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్ మీడియట్ డీవీఈవో వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ఆయన చక్రాయపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి మాట్లాడారు. ప్రిన్సిపాల్ రంతుబాషా మాట్లాడుతూ విధి నిర్వహణలో అందరూ ప్రభుత్వ ఆదేశానుసారం నడచుకోవాలన్నారు. కళాశాలలో విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని కొవ్వూరు జ్యోత్స్నను అభినందించారు.

కూరెళ్ల, దత్తాత్రేయశర్మలకు 'జానమద్ది' సాహితీ పురస్కారం

కడప కల్చరల్ : ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, గండ్లూరి దత్తాత్రేయశర్మలు 2024 సంవత్సరానికిగాను డాక్టర్ జానమద్ది సాహితీపీఠం పురస్కారాలకు ఎంపికయ్యారు. బ్రౌన్ గ్రంథాలయ వ్యవస్థాపకులు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి పేరిట ఏర్పాటు చేసిన జానమద్ది సాహితీ పీఠం పక్షాన కర్నూలుకు చెందిన ప్రముఖ కవి, అవధాని గండ్లూరి దత్తాత్రేయశర్మకు, తెలంగాణ రాష్ట్రం యాదాద్రి జిల్లాకు చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యకు గ్రంథాలయ సేవలకుగాను ఈ అవార్డులు అందజేయనున్నారు. ఈ విషయాన్ని జానమద్ది సాహితీ పీఠం గౌరవ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి, మండలి బుద్ధప్రసాద్, పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ తెలిపారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం నరాల, గుండెజబ్బుల వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సబ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం వరకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

జగనన్న కాలనీలో విద్యుత్ వెలుగు

సాక్షి ఎఫెక్ట్..


జగనన్న కాలనీలో తొలగిన అంధకారం

ముద్దనూరు : స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం సమీపంలోని జగనన్న కాలనీలో అధికారులు విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఈనెల 27వ తేదీన సాక్షి దినపత్రికలో 'అంధకారంలో జగనన్న కాలనీ' అనే శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు వీధి దీపాలు, అవసరమైన లబ్ధిదారులకు విద్యుత్ మీటర్లు అందుబాటులోకి తెచ్చారు. జగనన్న కాలనీలో వినియోగదారులకు విద్యుత్ సమస్య లేకుండా చేస్తామని ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ వర్మ తెలిపారు. సాక్షి కథనంలో తమ కాలనీకి విద్యుత్ వెలుగులు రావడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కలప మొక్కలతో దీర్ఘకాలిక ఆదాయం

కొండాపురం : బీడు భూమి కొండప్రాంతాల్లో కలప మొక్కలను పెంచడంతో దీర్ఘకాలికంగా ఆదాయం ఉంటుందని రాష్ట్ర అసోసియేట్ టోఫి సభ్యుడు సతీష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బురుజుపల్లిలో రైతుసేవా కేంద్రంలో రైతులతో ఆయన వివిధ ఆగ్రో ఫారెస్ట్రీ పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. టేకు, గంధం, ఎర్రచందనం, వెదురు మొక్కలను పెంచడం వల్ల దీర్ఘకాలిక ఆదాయం పొందవచ్చునన్నారు. ఈ మొక్కలు పెంచడం వల్ల వాయు కాలుష్యం నివారించవచ్చునన్నారు. ఉద్యానవన తోటలలో సరిహద్దులు చుట్టూ ఈ కలప మొక్కలను పెంచుకోవచ్చునన్నారు. తిరుపతిలోని నర్సరీలలో ఈ కలప మొక్కలు దొరుకుతాయన్నారు.

అక్రమంగా ప్రభుత్వ బియ్యం తరలిస్తే చర్యలు

ఎర్రగుంట్ల : మండల పరిధిలో ప్రభుత్వ బియ్యంను ఎవరైనా అక్రమంగా సరఫరా చేస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని స్థానిక తహశీల్దార్ శోభన్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఇంటింటికి ప్రభుత్వ బియ్యంను సరఫరా చేస్తామన్నారు. మండల పరిధిలో ఎక్కడైన ఎవరైన ప్రభుత్వ బియ్యంను తరలిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైన బియ్యం కొనాలని వస్తే వెంటనే రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నుంచి బియ్యం తీసుకుని అమ్ముకున్న వారిపై, కొన్న వారిపై కూడా చర్యలు ఉంటాయన్నారు. రేషన్ బియ్యం మాఫీయా నియంత్రణకు మండలంలో ప్రత్యేకంగా రెవెన్యూ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విగ్రహాలకు పోలీస్ అనుమతి తప్పనిసరి


మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

జమ్మలమడుగు రూరల్ : వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీస్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వినాయక చవితి పండుగ ప్రశాంతంగా జరిగేలా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పోలీస్ అధికారులు రాత్రి పూట బందోబస్తు నిర్వహించాలన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వరప్రసాద్


హాజరైన కౌన్సిలర్లు, తదితరులు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్‌లు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి అధ్యక్షతన మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లతో సాదారణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఎక్కడా సమస్యలు లేకుండా వార్డులలో పర్యటించి వాటిని గుర్తించి పరిష్కరించాలన్నారు. మంచినీటి సమస్య, వీధిలైట్ల నిర్వహణ, తడి, పొడిచెత్త, తదితర వాటిపై స్పందించి ఎక్కడా సమస్యలు లేకుండా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. వర్షాకాలంలో వర్షపు నీరు నిల్వ లేకుండా అధికారులు కూడా వెంటనే స్పందించి సరిచేయాలన్నారు. పట్టణంలోని శ్రీరంగనాథస్వామి ఆలయ సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్‌కు శ్రీరంగనాథస్వామి కూరగాయల మార్కెట్‌గా నామకరణం చేసేందుకు కౌన్సిలర్లందరు ఆమోదం తెలపాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల సహకారంతో హిందువుల మనోభావాలు దెబ్బతినకుండా శ్రీకృష్ణ దేవరాయల కాలం నాటి పూర్వ చరిత్ర గల రంగనాథస్వామి ఆలయం పేరును కూరగాయల మార్కెట్‌కు పెట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. పులివెందులలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలకు కూటమి ప్రభుత్వం వైఎస్సార్ పేరు తొలగించాలని చూస్తున్నారని, అక్కడ ఉన్న ఆసుపత్రిని యదాస్థానంలోకి తీసుకురావాలని ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు చేస్తోందన్నారు. వీటిపై కూడా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి పులివెందులపై పక్షపాత ధోరణి కనిపిస్తోందని, దీనిని పూర్తిగా వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యూజీడీ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీలో కొంత మంది లబ్ధిదారుల పేర్లు తొలగించడం జరిగిందని, వీటిపై కూడా పూర్తి విచారణ చేపట్టి లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న కమిషనర్ రమణారెడ్డిని దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. వివిధ అభివృద్ధి పనులు, పెండింగ్ పనులపై కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

పులివెందుల : పట్టణంలో సెప్టెంబర్ 2వ తేదీ ఆర్యవైశ్య అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ సంఘం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత గుండె వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వాసవిక్లబ్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారిశాలలో నిర్వహించే ఈ ఉచిత గుండె వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గుండెనొప్పి, చాతి నొప్పి, గుండెదడ, ఆయాసం, కళ్లు తిరగడం, గుండెలో మంట కలగడం, చాతిలో బరువుగా ఉండటం, కాలు వాపు రావడం, చమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్నవారు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్య శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా మాస్కులు ధరించాలన్నారు.

లక్ష్యసాధన కోసం కృషి చేయాలి


పూర్వపు విద్యార్థిని విద్యాధరిని సన్మానిస్తున్న డైరెక్టర్

వేంపల్లి : ప్రతి విద్యార్థి లక్ష్యసాధన కోసం కృషి చేయాలని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ పూర్వపు విద్యార్థిని గొబ్బిళ్ళ విద్యాధరి తెలిపారు. శుక్రవారం పూర్వ విద్యార్థుల సంఘం మద్దతుతో పరస్పర విద్యార్థులతో సమావేశం నిర్వహించేందుకు ఈ విద్యార్థి ఆర్కేవ్యాలీ క్యాంపస్‌ను సందర్శించారు. ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో 2014 బ్యాచ్‌లో విద్యాధరి ఈసీఈ పూర్తి చేశారు. ఈ విద్యార్థి 2021లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో 221 ర్యాంకు సాధించి ఇటీవల చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఆమె లక్ష్యాల పట్ల అకుంఠిత దీక్షకు నిలువెత్తు నిదర్శనమని డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామిగుప్తా తెలిపారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రవి కుమార్, అకాడమిక్ డీన్ రత్నకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైలవరం ఉత్తర కాలువకు నీరు విడుదల


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

జమ్మలమడుగు : మైలవరం ఉత్తర కాలువకు శుక్రవారం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటలు వర్షాలు లేక ఎండిపోతుండటంతో 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం గండికోట జలాశయంలో 18 టీఎంసీల కృష్ణాజలాలు వచ్చి చేరుతన్నాయన్నారు. గండికోట నుంచి 7500 క్యూసెక్కుల నీటిని మైలవరం జలాశయంకు విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నిదానాల్లో కన్నా నేత్రదానం గొప్పది


మాట్లాడుతున్న మెడికల్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి

పులివెందుల టౌన్ : అన్ని దానాల్లో కన్నా నేత్రదానం గొప్పదని స్నేహిత అమృతహస్తం సేవా సమితి నేత్రసేకరణ కేంద్రం మెడికల్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి తెలిపారు. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థినులకు నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు నేత్రదానం చేసేందుకు అంగీకారం తెలపాలన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నేత్రదానంపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సేవా సమితి అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ కుటుంబంలో లేదా సన్నిహితులు మరణించిన అనంతరం నేత్రదానం చేయదలచిన వారు 9966509364, 7093204537లకు సమాచారం ఇవ్వడంతో పార్థివ దేహం వద్దకే వచ్చి నేత్రాలను సేకరిస్తామన్నారు. కార్యక్రమంలో నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్, కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనిత, షిప్ కో ఆర్డినేటర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు బండలాగుడు పోటీలు

పెద్దముడియం : మండలంలోని భీమగుండం గ్రామ సమీపాన శ్రావణ శనివారం సందర్భంగా శ్రీ అభయఅంజనేయస్వామి దగ్గర బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలలో గెలుపొందిన వృషభరాజులకు మొదటి బహుమతి రూ.30,000, రెండవ బహుమతి రూ.20,000, మూడవ బహుమతి రూ.15,000, నాలుగవ బహుమతి రూ.10,000, ఐదవ బహుమతి రూ.5,000 అందజేస్తామని తెలిపారు.

కొల్హాపూర్ మహాలక్ష్మిగా వాసవీ మాత


అష్టలక్ష్మి కలశాలను అలంకరించిన ఆర్యవైశ్య మహిళలు

వేంపల్లి : స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో వాసవి మాతా అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేశారు. వాసవి మాతా కొల్హాపూర్ మహాలక్ష్మిగా దర్శనమిచ్చారని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర, మహిళా మండలి అధ్యక్షురాలు ప్రవీణా కిషోర్ తెలిపారు. ఆలయంలో ఉదయాన్నే ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో పంచామృతాభిషేకం, మహామంగళ హారతి తదితర విశేష పూజలు నిర్వహించామన్నారు. ఆర్యవైశ్య మహిళలచే మంగళ ద్రవ్యాలతో అష్టలక్ష్మి కలశాలను అలంకరించామన్నారు. లలితా సహస్రనామం, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశామన్నారు.